# ఫైనల్లో యువ భారత్

**సెమీస్‌లో 7 వికెట్ల తేడాతో లంకపై ఘన విజయం**



షార్జా: అండర్-19 ఆసియా కప్‌లో యువ భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన లంక 46.2 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. లక్విన్ అభయసింఘే(69), షారుజన్ షణ్ముగనాథన్(42) మినహా అందరూ బ్యాటర్లు నిరాశపరిచారు. ఇన్నింగ్స్‌లో ఏడుగురు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యారు. భారత బౌలర్లలో చేతన్‌శర్మ మూడు వికెట్లతో రాణించగా, కిరణ్ చోర్మలే, ఆయుశ్ మాత్రె రెండు వికెట్లతో లంకను నిలువరించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యువ భారత్ సూర్యవంశీ(36 బంతుల్లో 67, 6ఫోర్లు, 5సిక్సర్లు) ధనాధన్ అర్ధసెంచరీతో 21.4 ఓవర్లలో 175-3 స్కోరు చేసింది. ఓపెనర్ ఆయుశ్ మాత్రె(34)తో కలిసి తొలి వికెట్‌కు సూర్యవంశీ 91 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సూర్యవంశీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో బంగ్లా 7 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది.

# బ్రూక్ సెంచరీ

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 280**



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఇంగ్లండ్ యువ బ్యాటర్ హారీ బ్రూక్(91 బంతుల్లో 123, 11ఫోర్లు, 5సిక్సర్లు) మెరుపు సెంచరీతో సత్తాచాటాడు. శుక్రవారం మొదలైన రెండో టెస్టులో తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ తొలి ఇన్నింగ్స్‌లో 280 స్కోరుకు ఆలౌటైంది. ఓపెనర్లు బెన్ డకెట్(0), జాక్ క్రాలీ(17), బెతెల్(16), రూట్(3) తీవ్రంగా నిరాశపరిచారు. అయితే బ్రూక్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఒలీ పోప్(66)తో కలిసి ఐదో వికెట్‌కు 174 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన బ్రూక్.. జట్టును ఒడ్డున పడేశాడు. స్మిత్‌కు నాలుగు, ఒరూర్క్ మూడేసి వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ మొదటి రోజు ఆట ముగిసే సరికి 86-5తో కష్టాల్లో పడింది. విలియమ్సన్ (37) తప్పా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. కార్స్‌కు రెండు వికెట్లు దక్కాయి.

# అన్మోల్ సంచలనం

- **గువాహటి మాస్టర్స్ టోర్నీ**



గువాహటి: గువాహటి మాస్టర్స్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ అన్మోల్ ఖర్బ్ సంచలనం సృష్టించింది. టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ లలిన్రాత్ చైవాన్‌కు దిమ్మతిరిగే షాక్ ఇస్తూ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో అన్మోల్ 21-13, 22-24, 22-20తో లలిన్రాత్(థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. మరో పోరులో మాన్సిసింగ్ 20-22, 18-21తో యటవీన్ కాటెక్లెంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలైంది. మరో వైపు పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ సతీశ్ కుమార్ 21-19, 21-13తో సరన్ జంప్రి(థాయ్‌లాండ్)పై గెలిచి సెమీస్‌లోకి వెళ్లాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ ధ్రువ్ కపిల-తనీషా క్యాస్ట్రో 21-16, 21-14తో సాత్విక్‌రెడ్డి-వైష్ణవి జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో టాప్‌సీడ్ జోడీ అశ్విని పొనప్ప, తనీశ 21-18, 21-13తో ఐదోసీడ్ హువాంగ్ కెజిన్, టాంగ్ రుయిజిపై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించారు.

# నేటి నుంచి సీఎం కప్ టోర్నీ

**నేడు, రేపు గ్రామ స్థాయి పోటీలు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ క్రీడా రంగాన్ని పటిష్టపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం కప్ టోర్నీకి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి గ్రామ స్థాయి పోటీలతో సీఎం కప్ పోటీలకు తెరలేవనుంది. మొత్తంగా 36 క్రీడాంశాలతో నాలుగు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తారు. రెండు రోజుల్లో దాదాపు 12వేల గ్రామాల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, యోగాతో పాటు స్థానిక ఆటకు ప్రాధాన్యమివ్వనున్నారు. సీఎం కప్‌లో పోటీపడేందుకు శుక్రవారం సాయంత్రం వరకు లక్ష మంది ప్లేయర్లు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని సాట్స్ తెలిపింది.

# స్టార్క్ సిక్సర్

**ఆరు వికెట్లతో విజృంభణ**

**భారత్ తొలి ఇన్నింగ్స్ 180 ఆలౌట్**

**అడిలైడ్ డే అండ్ నైట్ టెస్టు**



స్టార్క్ (6-48)

నితీశ్ (42)

**ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ)లో భారత్, ఆస్ట్రేలియా మధ్య అడిలైడ్‌లో గులాబీ పోరు రసవత్తరంగా సాగుతున్నది. పెర్త్ టెస్టు విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన భారత్‌కు అడిలైడ్‌లో మెరుగైన శుభారంభం దక్కలేదు. ఆసీస్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ ఆరు వికెట్ల విజృంభణతో టీమ్ఇండియా 180 పరుగులకే పరిమితమైంది. సహచర క్రికెటర్లు అంతగా ఆకట్టుకోలేకపోయిన వేళ తెలుగు క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి తెగువ చూపించాడు. కంగారూ బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొంటూ కీలకమైన పరుగులు జత చేశాడు. టీమ్ఇండియాను స్వల్ప స్కోరుకు పరిమితం చేసిన ఆసీస్..వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. రెండో రోజు తొలి సెషన్ ఇరు జట్లకు కీలకం కానుంది.**

అడిలైడ్: భారత్, ఆస్ట్రేలియా మధ్య శుక్రవారం మొదలైన అడిలైడ్ టెస్టు ఆసక్తికరంగా సాగుతున్నది. ఆధిక్యం చేతులు మారుతూ వస్తున్న పోరులో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ఇండియా 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. పెర్త్ టెస్టు సెంచరీ హీరో యశస్వి జైస్వాల్(0) సున్నాకే పరిమితం కాగా, కేఎల్ రాహుల్(37) ఆకట్టుకున్నాడు. మిడిలార్డర్‌లో కెప్టెన్ రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ నిరాశపరిచారు. కెరీర్‌లో రెండో టెస్టు ఆడుతున్న నితీశ్‌కుమార్‌రెడ్డి(54 బంతుల్లో 42, 3ఫోర్లు, 3సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌తో కదంతొక్కాడు. ఆసీస్ పేస్ స్టార్ మిచెల్ స్టార్క్(6-48) ధాటికి టీమ్ఇండియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. స్టార్క్ పదునైన పేస్ బౌలింగ్‌తో టీమ్ఇండియా ఆరుగురు సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితమయ్యారు. మెరుపు వేగానికి స్వింగ్ జోడిస్తూ గులాబీ బంతితో స్టార్క్ తనదైన శైలిలో చెలరేగాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ఆట ముగిసే సరికి వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. నాథన్ మెక్స్వీని(38), లబుషేన్(20) క్రీజులో ఉన్నారు. చేతిలో 9 వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 94 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ(13) వికెట్ తీయడం ద్వారా బుమ్రా(1-13) ఈ ఏడాది టెస్టుల్లో 50 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు.

**స్టార్క్ పేస్ జోరు:**

అడిలైడ్ పోరులో టాస్ గెలిచిన టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ మరో ఆలోచన లేకుండానే బ్యాటింగ్‌కు మొగ్గుచూపాడు. పచ్చికతో కూడిన పిచ్‌పై బ్యాటింగ్ ఎంతటి ప్రమాదమో ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే తెలిసొచ్చింది. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మొదటి బంతికే యశస్వి జైస్వాల్(0)ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. వికెట్ల ముందు దొరికిపోవడంతో జైస్వాల్..డీఆర్ఎస్‌కు వెళ్లే సాహసం కూడా చేయలేకపోయాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్(31) నిలకడ కనబరిచాడు. రాహుల్ జతగా ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశాడు. 21 బంతుల వరకు ఖాతా తెరువని గిల్..స్టార్క్ బౌలింగ్‌లో బౌండరీలతో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో బోలాండ్(2-54), కమిన్స్(2-41)ను రాహుల్ దీటుగా ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో ఓసారి రాహుల్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బోలాండ్ వేసిన బంతిని అంపైర్ నోబాల్‌గా ప్రకటించడంతో రాహుల్‌కు లైఫ్ లభించింది. ఇన్నింగ్స్‌కు గాడిలో పడిందనుకున్న తరుణంలో గిల్‌ను బోలాండ్ ఎల్బీడబ్ల్యూ చేయడంతో రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు బోలాండ్, మరోవైపు స్టార్క్ కూడా విజృంభించడంతో టీమ్ఇండియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. స్టార్క్ దూకుడుతో 12 పరుగుల తేడాతో భారత్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. రాహుల్, కోహ్లీ(7), రోహిత్(3) నిరాశపర్చడంతో టీ బ్రేక్ సమయానికి భారత్ 81-4 స్కోరుకు పరిమితమైంది.

**నితీశ్ ఒంటరిగా:**

ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..యువ క్రికెటర్ నితీశ్‌కుమార్ మెరుగైన పరిణతి కనబరిచాడు. స్టార్క్ గులాబీ బంతితో ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్‌తో బెంబేలెత్తిస్తున్నా..ఎక్కడా వెరువకుండా నితీశ్ బ్యాటింగ్ కొనసాగించాడు. 87 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన స్థితిలో రిషబ్ పంత్(21)తో కలిసి నితీశ్ అద్భుత పోరాటపటిమ కనబరిచాడు. ఆసీస్ బౌలింగ్ దాడిని తిప్పికొడుతూ నితీశ్ బ్యాటింగ్ కొనసాగించడంతో స్కోరు 150 పరుగుల మార్క్ దాటింది. స్టార్క్ బౌలింగ్‌లో రివర్స్ స్కూపింగ్ ద్వారా నితీశ్ కొట్టిన షాట్ చూస్తే వారెవ్వా అనాల్సిందే. అయితే ఆరో వికెట్‌కు 22 పరుగులు జత చేసి పంత్ ఔట్ కాగా, నితీశ్, అశ్విన్(22) దూకుడు కనబరిచారు. స్టార్క్ మరోమారు టీమ్ఇండియాను దెబ్బతీశాడు. నాలుగు బంతుల తేడాతో అశ్విన్, రానా(0)ను ఔట్ చేసిన స్టార్క్..ఆఖర్లో నితీశ్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. మొత్తంగా 82-4తో మెరుగ్గా కనిపించిన టీమ్ఇండియా 98 పరుగుల తేడాతో చివరి 6 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది.

**ఆసీస్ నిలకడగా:**

అడిలైడ్ పిచ్‌పై ఆసీస్ బ్యాటర్లు ఒకింత నిలకడ కనబరిచారు. బుమ్రా పేస్ దాడిని కాచుకుకూర్చుకుంటూ స్కోరుబోర్డుకు కీలకపరుగులు జతచేశారు. ఓపెనర్ ఖవాజ మరోమారు నిరాశపరిచగా, మెక్స్వీని(38) బుమ్రా బౌలింగ్‌లో బతికి పోయాడు. మెక్స్వీని ఇచ్చిన క్యాచ్‌ను పంత్ విడిచిపెట్టడంతో ఆసీస్‌కు కలిసొచ్చింది. ఫామ్‌లేమితో సతమతమవుతున్న లబుషేన్..టీమ్ఇండియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 44.1 ఓవర్లలో 180 ఆలౌట్(నితీశ్ 42, రాహుల్ 37, స్టార్క్ 6-48),
**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 33 ఓవర్లలో 86-1(మెక్స్వీని 38, లబుషేన్ 20, బుమ్రా 1-13)

చిత్రం

# విశ్వంభర ఆ రోజేనా?



చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.

# మీకు సుపరిచితుడు మీలో ఒకడు..




రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇంకా టైటిల్‌ని ఖరారు చేయని ఈ చిత్రంలో 'సాగర్' అనే పాత్రలో రామ్ కనిపించనున్నారు. శుక్రవారం ఆయన పాత్రను పరిచయం చేస్తూ 'మీకు సుపరిచితుడు.. మీలో ఒకడు.. మీ సాగర్' అనే అక్షరాలు పొందుపరచిన రామ్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇక ఈ లుక్ విషయానికొస్తే.. వింటేజ్ ఫీలింగ్ కలిగేలా రామ్ లుక్ ఉండటం గమనార్హం. పాత రోజుల్లో ఉపయోగించే సైకిల్, లాంగ్ హెయిర్ అండ్ క్లీన్ షేవ్‌తో అందంగా నవ్వుతూ రామ్ ఈ ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైందని, ప్రస్తుతం హైదరాబాద్ శివారుల్లోనే షూటింగ్ జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీబోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధు నీలకందన్, సంగీతం: వివేక్-మెర్విన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి.

# ఇంకెప్పుడూ నటించొద్దన్నారు



'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ''శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్ ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.

# రేవతి కుటుంబానికి 25లక్షల పరిహారం



అల్లు అర్జున్ కథానాయకుడిగా రూపొందిన 'పుష్ప2' సినిమా గురువారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రీమియర్ సందర్భంగా అల్లు అర్జున్ అండ్ టీమ్ హైదరాబాద్ సంధ్య థియేటర్‌కు రావడంతో అక్కడ జరిగిన తొక్కిసలాట కారణంగా రేవతి అనే ఓ మహిళ మృతి చెందారు. ఈ విషయంపై శుక్రవారం అల్లు అర్జున్ స్పందిస్తూ సోషల్‌మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. 'మేం ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌కి వెళ్లాం. అక్కడ జరిగిన తొక్కిసలాటలో కొందరికి దెబ్బలు తగిలాయని తెలిసింది. రేవతి అనే మహిళ మృతి చెందిందనీ, ఆమె కుమారుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయని తెలియగానే షాక్‌కు గురయ్యాను. థియేటర్‌కి వెళ్లి అభిమానులతో కలిసి సినిమా చూడటం 20ఏళ్లుగా నాకు అలవాటు. ఆ ఆనవాయితీ ప్రకారం వెళ్లాను. కానీ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని మాత్రం అనుకోలేదు. ఇది నన్ను తీవ్రంగా కలచివేసింది. రేవతి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మేం ఎంత చేసినా ఆ కుటుంబానికి ఎదురైన లోటుని పూడ్చలేం. నా వంతు పరిహారంగా 25లక్షలు వారి కుటుంబానికి అందజేస్తున్నాను. అంతేకాక ఆమె కుమారుడి మెడికల్ ఖర్చులు కూడా భరిస్తానని తెలియజేస్తున్నాను. ఇక ఆ కుటుంబం బాధ్యత నాదే.' అని తెలిపారు.

# ఆర్కాడీ ప్రపంచంలో..




సాయిదుర్గతేజ్ ప్రస్తుతం పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్న విషయం తెలిసిందే. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. ఈ నెల 12న టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఆర్కాడీ అనే ఊహాత్మక ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ డ్రామాలో సాయిదుర్గతేజ్ పాత్ర అత్యంత శక్తివంతంగా ఉంటుందని, పీడితులను రక్షించే ధీరోదాత్తుడిగా కనిపిస్తాడని చెబుతున్నారు. ఐశ్వర్య లక్ష్మీ, జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, రచన-దర్శకత్వం: రోహిత్ కేపీ.

# ఒక రోజు.. ప్రేమకథ



దక్షిణాదిలో తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్న అగ్ర కథానాయిక సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి పెడుతున్నది. 'రామాయణ' చిత్రం ద్వారా ఆమె హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు అమీర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్‌తో కలిసి ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నది. అమీర్‌ఖాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సునీల్‌పాండే దర్శకుడు. ఈ చిత్రానికి 'ఏక్ దిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని అమీర్‌ఖాన్ స్వయంగా వెల్లడించారు. హృద్యమైన ప్రేమకథాంశమిదని, ఈ సినిమాతో సాయిపల్లవి ఉత్తరాది యువతకు చేరువవుతుందని చిత్ర బృందం పేర్కొంది. ఇదిలావుండగా ఇటీవల విడుదలైన 'అమరన్' చిత్రంలో సాయిపల్లవి అద్భుతాభినయానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సినిమా బాలీవుడ్‌లో కూడా హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి హిందీ సినిమాల తాలూకు అప్‌డేట్స్‌పై అక్కడి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# శత్రువులను భయపెట్టే విధ్వంసం



సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ బాలీవుడ్ యాక్షన్ చిత్రం 'జాట్'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. హీరో, పోలీస్ ఆఫీసర్ పాత్రల మధ్య సాగే డైలాగులతో టీజర్ మొదలైంది. హీరో డైలాగ్.. అతని నటోరియస్ నేచర్, శత్రువులను భయపెట్టే విధ్వంస మార్గాన్ని సూచిస్తున్నది. విలన్ల కాళ్లూ, చేతులు గొలుసులతో కట్టేసి, వేళ్లాడదీసి, వారిమధ్య నుంచి ఉద్వేగంగా, ఉద్రేకంగా వస్తున్న హీరో ఇంట్రడక్షన్ టీజర్‌లో హైలైట్. భారీ ఫ్యాన్‌ని చేతబూని హీరో చేస్తున్న ఫైట్ సీక్వెన్స్ మాస్ మెచ్చేలా ఉంది. మెయిన్ విలన్‌గా రణదీప్ హుడాను పరిచయం చేయడంతో ఈ టీజర్ ముగిసింది. వినీత్‌కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబి, సంగీతం: ఎస్.థమన్.

# అలాంటి సినిమాలు తీయొద్దు



పురుషాధిక్యాన్ని, పితృస్వామ్య భావనలను ప్రతిబింబించే సినిమాలను తాను వ్యతిరేకిస్తానని, అలాంటి కథలు సమాజాన్ని కొన్ని ఏళ్లు వెనక్కి తీసుకెళ్తాయని వ్యాఖ్యానించారు బాలీవుడ్ అగ్ర నటుడు, మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్. ఇటీవల ఓ అంతర్జాతీయ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పైవిధంగా స్పందించారు. 'గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది. అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషులపై ఉంది' అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం ప్రశంసలతో పాటు ఈ ఏడాది భారత్ నుంచి ఆస్కార్ బరిలో పోటీపడుతున్న అధికారిక చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం అమీర్‌ఖాన్ 'తారే జమీన్ పర్' సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది విడుదల కానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.